# సూళ్లూరుపేట ఆర్డీఓ కార్యాలయంపై ఎసిబి దాడులు



పట్టుబడిన ఉద్యోగులు

**సూళ్లూరుపేట, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త** సూళ్లూరుపేట ఆర్డీఓ కార్యాలయంపై ఎసిబి అధికారులు శనివారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ప్రత్యేకంగా వలపన్ని ఈ దాడులు ప్రణాళికాబద్ధంగా చేపట్టారు. ఈ దాడుల్లో ఆర్డీఓ కార్యాలయంలో క్యాంప్ క్లర్క్ హేమంత్, సీనియర్ అసిస్టెంట్ సిరాజ్‌లు అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. అలాగే వీరికి మధ్యవర్తిగా వ్యవహరించి నగదు సేకరించిన సూళ్లూరుపేటకు చెందిన వెంకటసుబ్బయ్యను కూడా ఎసిబి అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఎసిబి ఎఎస్పీ బిహెచ్ మునికుమారి వెల్లడించిన వివరాల మేరకు, వరదయ్యపాలెం మండలం సంతవేలూరు గ్రామానికి చెందిన హరనాథ్ అనే రైతు తనకు గల 90 సెంట్ల పొలంలో 66 సెంట్లు పోరంబోకుగా రికార్డుల్లో తప్పుగా నమోదై ఉందంటూ తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పిజిఆర్ఎస్ కార్యక్రమంలో భాగంగా వినతిపత్రాన్ని అందజేశారు. దీంతో స్పందించి జిల్లా అధికార యంత్రాంగం వరదయ్యపాలెం తహశీల్దార్‌కు ఈ విషయమై విచారణ చేపట్టాలని ఆదేశించారు. విచారణ చేపట్టిన అనంతరం అడంగళ్‌లో జరిగిన పొరపాట్లను సరిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలని సూళ్లూరుపేట ఆర్డీఓ కార్యాలయానికి వరదయ్యపాలెం తహశీల్దార్ నివేదిక పంపారు. అక్కడి నుంచి అసలు తతంగం మొదలయింది. రైతు హరనాథ్ ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లి తన పొలం విషయంపై మాట్లాడగా, ఇందుకు సిసి హేమంత్, సీనియర్ అసిస్టెంట్ సిరాజ్ రూ.40 వేలు డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో హరనాథ్ కుమారుడు పూర్ణచంద్రరావు తిరుపతి ఎసిబి అధికారులను ఆశ్రయించాడు. ఈ విషయమై రంగంలోకి దిగిన ఎసిబి అధికారులు శనివారం వలపన్ని ఉద్యోగులను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. రూ.40వేలు నగదును పూర్ణచంద్రరావు సూళ్లూరుపేట ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో మోటార్‌బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్న వెంకటసుబ్బయ్యకు అందిస్తుండగా ఎసిబి అధికారులు దాడులు చేసి పట్టుకున్నారు. అలాగే ఫోన్ ద్వారా నగదు తీసుకోవాలని వెంకటసుబ్బయ్యకు సూచించిన సిసి హేమంత్, సిరాజ్‌లను కార్యాలయానికి వెళ్లి అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో జరుగుతున్న వివిధ అవినీతి ఆరోపణలపై అనంతపురం ఎసిబి డిఎస్పీ, తిరుపతి ఇన్‌ఛార్జ్‌గా ఉన్న ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. వివిధ ఫైళ్లు స్వాధీనం చేసుకున్నారు. అలాగే గతంలో పనిచేసిన ఆర్డీఓ కార్యాలయ ఎఓ రవికుమార్‌ను కూడా విచారిస్తున్నారు. ఇదిలావుంటే మూడురోజులు క్రితమే ఇక్కడి నుంచి జిఎడికి అటాచ్ చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో అప్పటి ఆర్డీఓ కిరణ్మయి ఇక్కడి నుంచి వెళ్లిన తర్వాత దాడులు జరగడం విశేషం. అలాగే ఇన్‌ఛార్జ్ ఆర్డీఓగా బాధ్యతలు చేపట్టిన దేవేంద్రరెడ్డి తన బాధ్యతలు స్వీకరించి రెండురోజులు కాకముందే ఈ దాడులు జరగడం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. గత కొన్ని నెలలుగా సూళ్లూరుపేట ఆర్డీఓ కార్యాలయంలో జరుగుతున్న అవినీతి కార్యకలాపాలపై జోరుగా గుసగుసలు వినిపిస్తున్న నేపథ్యంలో ఈ దాడులకు ప్రత్యేకత సంతరించుకుంది. సూళ్లూరుపేట పట్టణంలో ఎసిబి దాడులు జరిగాయన్న సమాచారంతో అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులు అప్రమత్తం అయ్యారు.

# జనసేన బలోపేతానికి సమష్టి కృషి



జనసేన ఉద్యమి సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్

**- రాష్ట్రానికి డిప్యూటీ సిఎం నాయకత్వం అవసరం**

**- 94 వేల నుండి 13 లక్షలకు చేరిన సభ్యత్వం**

**- పార్టీ కోసం పని చేసిన వారికే స్థానిక సంస్థల ఎన్నికల్లో అవకాశం**

**- జనసేన ఉద్యమి సమావేశంలో మంత్రి నాదెండ్ల మనోహర్**

**చిత్తూరు, ఫిబ్రవరి 28 ప్రభాతవార్త:** జనసేన పార్టీ బలోపేతంకు క్షేత్ర స్థాయి నుండి సమిష్టిగా కృషి చేయాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి, పిఎసి ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ పిలుపునిచ్చారు. చిత్తూరు బాలత్రిపురసుందరి కళ్యాణ మండపంలో శనివారం జనసేన పార్టీ సభ్యత్వ నమోదుపై జనసేన ఉద్యమి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి, పిఎసి ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ రాష్ట్రానికి జనసేన అధినేత, డిప్యుటీ సిఎం పవన్ కళ్యాణ్ నాయకత్వం ఎంతో అవసరం వుందన్నారు. జనసేన పార్టీ ప్రారంభ సమయంలో 94 వేల మంది సభ్యులుగా వుంటే గత ఏడాది ఈ సభ్యత్వం 13 లక్షలకు చేరిందన్నారు.

ప్రస్తుతం పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్ళి క్షేత్ర స్థాయిలో పెద్ద సంఖ్యలో పార్టీ సభ్యత్వ నమోదు నిర్వహించి రికార్డు సృష్టించాలని మంత్రి పిలుపునిచ్చారు. అలాగే పార్టీని నిర్మాణాత్మకంగా ముందుకు తీసుకెళ్ళా ల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై వుందన్నారు. క్షేత్ర స్థాయిలో పార్టీని బలోపేతం చేయడానికి నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పని చేయాలని పిలుపునిచ్చారు. జనసేన పార్టీలో క్షేత్ర స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు పని చేసే వారికి తగిన గుర్తింపు లభిస్తుందని మంత్రి హామీ ఇచ్చారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పార్టీ కోసం కష్టపడి పని చేసిన వారికి మాత్రమే టిక్కెట్లు లభిస్తాయని, ఎవరికైతే వారికి టిక్కెట్లు ఇచ్చే ప్రసక్తే వుండదని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు వుంటాయన్నారు. చిత్తూరు జిల్లాలో జనసేన నాయకత్వం బలంగా వుండాలంటే ప్రతి ఒక్కరు కలసికట్టుగా పని చేయాలని పిలుపునిచ్చారు. జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య చిన్న చిన్న తగాదాలు వుంటాయని, వాటిని చూసి విడిపోకూడదని, కలసికట్టుగా పని చేసి పార్టీని ఉన్నత స్థానంకు తీసుకెళ్ళాలని నాయకులు, కార్యకర్తలకు మంత్రి పిలుపునిచ్చారు. జనసేన పార్టీ సభ్యత్వ కార్యక్రమంను క్షేత్ర స్థాయి నుండి ప్రారంభించి విజయవంతంగా పూర్తి చేయాలన్నారు. జనసేన పార్టీ ప్రతి కార్యకర్తలకు అండగా నిలుస్తోందని స్పష్టం చేశారు.

## అదానీ కంపెనీ నుండి విద్యుత్ కొనుగోలు చేసే సెకీ ఒప్పందాన్ని రద్దు చేయాలి: సిపిఎం డిమాండ్

**విజయవాడ,ఫిబ్రవరి 28,ప్రభాతవార్తప్రతినిధి:** సెకీ ద్వారా అదానీతో చేసుకున్న విద్యుత్ కొనుగోలు ఒప్పందాన్ని రద్దు చేయాలని సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. అదానీ కంపెనీ నుండి విద్యుత్ కొనుగోలు చేసే అవినీతికర సెకీ ఒప్పందాన్ని రద్దు చేయాలని, అందుకు బాధ్యులైనవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. దీనికి సంబంధించి శనివారం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఓ ప్రకటనను విడుదల చేశారు. యూనిట్‌కు రూ.2.49 లు చొప్పున 300 మెగావాట్ల విద్యుత్‌ను సెకీ నుండి కొనుగోలు చేయడానికి అవసరమైన సరఫరా ఏర్పాట్ల కోసం గురువారం ఇంధన శాఖ జివో ఎంఎస్ నెంబర్ 8 జారీ చేయడం ద్వారా ప్రభుత్వ దగాకోరుతనం వెల్లడయిందని, ఇప్పటికైనా ఈ ఒప్పందాన్ని పూర్తిగా రద్దు చేయాలని, ఆ కంపెనీని బ్లాక్‌లిస్టులో పెట్టాలని సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తున్నదన్నారు. వినాశకర విద్యుత్ సంస్కరణల అమలులోను, రాష్ట్ర సంపదను అదానీలాంటి కార్పొరేట్‌లకు దోచిపెట్టడంలో గత వైసిపి ప్రభుత్వం దారిలోనే ఇప్పటి టిడిపి కూటమి ప్రభుత్వం నడుస్తున్నట్లు మరోసారి రుజువైందన్నారు. సౌర, పవన విద్యుత్ అంతకంతకు చౌకగా లభిస్తున్న సమయంలో అదానీ కంపెనీ ఉత్పత్తి చేసిన విద్యుత్‌ను 25 సంవత్సరాలపాటు 7 వేల మెగావాట్ల విద్యుత్ కొనుగోలు చేయడం జనాన్ని మోసం చేయడమేనన్నారు.

ఈ విషయంలో వేల కోట్ల రూపాయలు చేతులు మారాయని .. ఇప్పటికీ అమెరికా కోర్టులో కేసులు పెండింగ్ ఉన్నాయని తెలిపారు. అవినీతికి పాల్పడిన అప్పటి ప్రభుత్వ పెద్దలను ఉన్నతాధికారులను బోనులో నిలబెట్టవలసిందిపోయి టిడిపి కూటమి ప్రభుత్వం కూడా అందుకు అనుగుణంగా జివో జారీ చేయడం కార్పొరేట్లకు, కేంద్ర బిజెపికి రాష్ట్రంలోని ప్రాంతీయ పార్టీలు దాసోహం అవుతున్నాయని స్పష్టమవుతోందన్నారు. అంతేకాదు గడువు ప్రకారం విద్యుత్ సరఫరా చేయకుండా ఒప్పందాన్ని ఉల్లంఘించిన అదానీ కంపెనీ నుండి పరిహారం రాబట్టాలని వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు.

## జనసేన కార్యాలయంలో ఘటన.. భద్రతాసిబ్బందిపై చర్యలు

**- ఐదుగురిని మాతృశాఖలో రిపోర్టు చేయాలని ఆదేశం**

**విజయవాడ ఫిబ్రవరి 28 ప్రభాతవార్త ప్రతినిధి:** మంగళగిరిలోని జనసేన కేంద్ర కార్యాలయంలోకి ఓ వ్యక్తి చొరబడి కార్లు ధ్వంసం చేసిన ఘటనలో అధికారులు చర్యలు చేపట్టారు. భద్రతా విభాగం నుంచి ఐదుగురిని మాతృశాఖకు పంపారు. రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ బి.పెంటారావుతోపాటు నలుగురు కానిస్టేబుళ్లను మాతృవిభాగంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. శ్రీకాకుళం జిల్లా కవిటి మండలం ఖాజూరుకు చెందిన నారద నీలాద్రి జనసేన కేంద్ర కార్యాలయంలోకి చొరబడి కార్లు ధ్వంసం చేయడం కలకలం రేపింది. భద్రత సిబ్బందిని నెట్టేసి, డిప్యూటీ సీఎం కాన్వాయ్‌లోని రెండు వాహనాలను ధ్వంసం చేశాడు. నిందితుడిని అదుపులోకి తీసుకున్న మంగళగిరి పోలీసులు కేసు నమోదు చేశారు.

# గడప వద్దకే పెన్షన్ : మంత్రి నారాయణ

**నెల్లూరు, ఫిబ్రవరి 28, ప్రభాతవార్త-వైద్యం** నెల్లూరు నగరంలోని 53వ డివిజన్ గాంధీ గిరిజన కాలనీలో శనివారం సంక్షేమ పండుగ నెలకొంది. మంత్రి నారాయణ స్వయంగా ఇంటింటికి వెళ్లి అవ్వాతాతలు, ఒంటరి మహిళలు, దివ్యాంగులకు ఒక రోజు ముందే పెన్షన్లను అందజేసి వారి ముఖాల్లో ఆనందం నింపారు. తమ గడప వద్దకే వచ్చి పెన్షన్ అందించిన మంత్రికి లబ్దిదారులు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వెంకటేశ్వరపురంలో ప్రజల తాగునీటి కష్టాలను తీరుస్తూ 28వ ఎన్టీఆర్ సుజల వాటర్ ప్లాంట్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు మంత్రికి ఘన స్వాగతం పలికి, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు ప్రతి నెల ఒకటో తేదీ ఒక పండుగ లాంటిదని, ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన మాట ప్రకారం రూ.4వేలు పెన్షన్ అందిస్తున్నారని మంత్రి నారాయణ పేర్కొన్నారు. గత ప్రభుత్వం నెలకు రూ1,300 కోట్లు పెన్షన్లకు వెచ్చిస్తే, మా ప్రభుత్వం ఏకంగా 2700 కోట్లు ఖర్చు చేస్తూ, 18 నెలల్లోనే 53,000 కోట్లు లబ్దిదారులకు అందజేసిందని ఆయన వెల్లడించారు. ఒకటో తేదీ ఆదివారం కావడంతో ముందు రోజే పంపిణీ చేపట్టామని, నెల్లూరు సిటీలో 20,588 మందికి 9 కోట్లకు పైగా పెన్షన్ ఇస్తున్నామని తెలిపారు. కేవలం సంక్షేమమే కాకుండా, 50 కోట్లతో డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపి, నెల్లూరును దోమలు లేని గ్రీన్ సిటీగా తీర్చిదిద్దుతామని, ఎన్టీఆర్ సుజల ద్వారా 2 రూపాలయకే 20 లీటర్ల మినరల్ వాటర్ అందిస్తున్నామని మంత్రి నారాయణ చెప్పారు. ఎమ్మెల్సీ బీదా రవిచంద్ర మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పెన్షన్ల పండుగ జరుగుతోంది. ఒక రోజు ముందుగానే పెన్షన్ అందడంతో వృద్దులు, వికలాంగుల ఆనందానికి అవధులు లేవన్నారు. అడగగానే స్పందించే గొప్ప నాయకుడు మంత్రి నారాయణ అని, ఆయన సిటీ ఎమ్మెల్యే కావడం నియోజకవర్గ ప్రజల అదృష్టం అని తెలిపారు.



స్కూల్స్, పార్కుల అభివృద్ధి, కాలువల పూడిక తీత పనులకు ఆయన పెద్ద పీట వేస్తున్నారన్నారు. కార్యకర్తల సంక్షేమమే పరమావధిగా విజన్‌తో నగరాభివృద్ధికి కృషి చేస్తున్నారనితెలిపారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర సివిల్ సప్లై డైరక్టర్ పట్టాభిరామిరెడ్డి, మేయర్ దేవరకొండ సుజాత అశోక్, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, కమీషనర్ నందన్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తాళ్ళపాక అనురాధ, మాజీ జడ్పీటీసీ విజేతరెడ్డి, డివిజన్ అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, స్థానిక టీడీపీ ముఖ్య నేతలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ స్వయం సమృద్ధి నియోజకవర్గంగా కుప్పం

**-250 మెగావాట్ల సోలార్ విద్యుత్తుకు సన్నాహాలు**

**తిరుపతి,ఫిబ్రవరి 28ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలోనే ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా చిత్తూరు జిల్లాలోని కుప్పం నియోజకవర్గాన్ని విద్యుత్ స్వయం సమృద్ధి నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని ఎస్పీడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి తెలిపారు. కుప్పం నియోజకవర్గంలో విద్యుత్ సంబంధిత అభివృద్ధి పనులపై ఆయన శనివారం ఉదయం వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా లోతేటి మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గం పరిధిలో ప్రస్తుతం 250 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ వుందని, ఈ విద్యుత్తును కుప్పం పరిధిలోనే పునరుత్పాదక ఇంధన వనరుల ద్వారా ఉత్పత్తి చేసే విధంగా ప్రణాళికను రూపొందించి, అమలు చేస్తున్నామమని వివరించారు. కుప్పం నియోజకవర్గం పరిధిలో ఫీడర్ లెవెల్ సోలరైజేషన్ ద్వారా 141 మెగావాటకల విద్యుదుత్పత్తికి సంబంధించిన పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. అదేవిధంగా ఎస్సీ,ఎస్టీ గృహ వినియోగదారులు కోసం 4.36 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి సంబంధించి రూఫ్ టాప్ సోలార్ సిస్టమ్స్ పనులు కొనసాగుతున్నాయని, బ్యాటరీ స్టోరేజ్ సిస్టమ్ పనులకు సంబంధించి టెండర్ల ప్రక్రియ చేపడుతున్నామని తెలియజేశారు. ఇక కుప్పం పరిధిలో 40 మెగావాట్ల సామర్థ్యంతో మరో 49 వేల గృహాలకు కూడా రూఫ్ టాప్ సోలార్ సిస్టమ్స్ ఏర్పాటు పనులకు సంబందించిన ప్రతిపాదనల్ని సిద్ధం చేశామన్నారు.

## మూడు నెలలు ముందుగానే ఖరీఫ్ సాగు

**- వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు**

**విజయవాడ ఫిబ్రవరి 28 ప్రభాతవార్త ప్రతినిధి:** ఖరీఫ్ సీజన్‌ను రెండు, మూలు నెలల ముందుకు తెస్తున్నామని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.దీనిపై రైతులకు అవగాహన కల్పించే దిశలో చర్యలు తీసు కుంటున్నామని తెలిపారు.అన్ని రిజర్వాయర్లలో నీరు అందుబాటులో ఉందని, ముందస్తు సాగు చేస్తే తుపాన్ల నుంచి తప్పించుకోవచ్చని పేర్కొన్నారు.ఈ మేరకు ఆయన కార్యాలయం నుంచి ప్రకటన విడుదల చేసారు..క్లస్టర్ బేస్డ్ విధానంలో ఉద్యానపంట సాగుకు ముందు కెళ్తున్నాం. వివిధ పంటల సాగుకు అను గుణంగా జిల్లాలను క్లస్టర్లుగా విభజించి, కేంద్రానికి ప్రతిపాదనలు పంపాం. కేంద్రం కూడా సానుకూలంగా ఉంది. వ్యవసాయం నుంచి ఉద్యానసాగు వైపు రైతులు మళ్లితే లాభా లొస్తాయి. ఉద్యానసాగును ప్రోత్స హించేందుకు గతంలో ఇచ్చినట్లే డ్రిప్‌లు, స్ప్రింక్లర్లను రాయితీపై అందిస్తాం. గతేడాది వ్యవసాయ యాంత్రీకరణకు రూ.61 కోట్లు ఖర్చుచేస్తే ఈ ఏడాది రూ.137 కోట్లు కేటాయించాం. రైతు సేవాకేంద్రాల పరిధిలో ఎంతమంది రైతులు న్నారు? ఎంత భూమి ఉంది? ఏయే పంటలు పండిస్తున్నారనే సమగ్ర నివేదికను తయారు చేస్తున్నాం. వారితో పాటు ఉద్యానపంటలు, నర్సరీలకూ ఉచిత విద్యుత్తును అమలు చేస్తున్నాం. ఈ ఏడాది చెరకు సాగుకూ ఉచిత విద్యుత్తు ఇస్తామని చెప్పారు.

# సిఎం పిలుపు మేరకు రూ.4 కోట్ల విరాళం!

## కమ్యూనిటి హాళ్లకు శంకుస్థాపన చేసిన కేంద్ర మంత్రి డా.పెమ్మసాని

**గుంటూరు ఫిబ్రవరి 28 ప్రభాత వార్త ప్రతినిధి :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు పి4 కార్యక్రమం క్రింద రూ.4 కోట్ల విరాళం ఇచ్చేందుకు వైద్యులు సూద్నగుంట రాఘవేంద్ర ప్రసాద్, కళ్యాణి ప్రసాద్ దంపతులు ముందుకు వచ్చారు.ఈ రూ.4 కోట్ల విరాళంతో గుంటూరు జిల్లాలో 9 కమ్యూనిటి భవనాలు నిర్మించనున్నారు. మొదటగా గుంటూరు జిల్లాలోని నంబూరు గ్రామంలో ముస్లిం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, నిర్మాణ దాతలు రాఘవేంద్ర ప్రసాద్, కళ్యాణి ప్రసాద్ లు కలిసి శనివారం శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా డా. పెమ్మసాని మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపుకు స్పందించి వైద్యులు రాఘవేంద్ర ప్రసాద్ దంపతులు షాదీఖానా నిర్మాణానికి ముందుకు రావడం ఆనందంగా ఉందన్నారు. దీనితో పాటు మరో 8 కమ్యూనిటీ హాల్స్ నిర్మాణానికి రూ. 4 కోట్ల విరాళాన్ని అందించినందుకు ధన్యవాదాలు తెలిపారు.డా. రాష్ట్రంలో ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా గాని సంక్షేమ పథకాలను సమయానికి అందిస్తున్న ఏకైక ప్రభుత్వం కూటమి ప్రభుత్వమని అన్నారు. గతంలో 2014 2019 మధ్య టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక భూముల ధరలు బాగా పెరిగాయని అన్నారు.వైసిపి ప్రభుత్వం వచ్చాక తిరిగి ధరలు పడిపోయాయని అన్నారు. ప్రస్తుతం అవే భూములు రూ.3 కోట్లకు పైగా ధరలు పలుకుతున్నాయి అంటే అది టీడీపీ ప్రభుత్వానికి ఉన్న ప్రాధాన్యత అని తెలిపారు. టిడిపి హయాంలో రోడ్లు, డ్రైన్లు, కల్వర్టులు వంటి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని అన్నారు.ఈ సందర్భంగా కమ్యూనిటి హాల్ దాత రాఘవేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ ఉన్నది దాచుకుంటే ఉపయోగం లేకుండా పోతుందని, ఉన్నది పంచుకుంటే అందరికీ ఉపయోగపడుతుందని స్పష్టం చేశారు. మాలాంటి వాళ్ల నుంచి సహాయం తీసుకుని అభివృద్ధిలోకి వచ్చిన యువత.. వారి వృద్ధాప్యంలో తిరిగి మరికొంత మంది యువతకు సహాయం అందించాలని కోరుకుంటున్నాని అన్నారు. కమ్యూనిటీ హాల్ శంకుస్థాపన అనంతరం ముస్లిం సోదరుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందులో కేంద్ర మంత్రి డా. పెమ్మసాని పాల్గొన్నారు. ముస్లిం సోదరులతో కలిసి పవిత్ర ప్రార్ధనలు చేశారు.



ఇఫ్తార్ విందులో కేంద్రమంత్రి డా. పెమ్మసాని

ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ అల్లా ఇచ్చిన అవకాశం ఈ పవిత్ర రంజాన్ మాసమని అన్నారు.కఠిన ఉపవాసాలు చేస్తూ ఆకలి, కష్టం విలువ ప్రతి ఒక్కరికి తెలియజేయడమే రంజాన్ పండుగ ప్రత్యేకతని తెలిపారు.ఆకలి బాధ తెలిస్తే ఎదుటివాడి కష్టం తెలుస్తుందని అన్నారు.

## పదవ తరగతి విద్యార్థులకు ఎడ్యుకేషనల్ అకాడమి బంపర్ ఆఫర్

**- 590 మార్కులు సాధిస్తే2 లక్ష రూపాయలు - రాష్ట్రస్థాయి ప్రథమ ర్యాంక్ సాధిస్తే రూ. 5లక్ష**

**కోవూరు (నెల్లూరు), ఫిబ్రవరి 28, ప్రభాతవార్త :** పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థులు రానున్న పదవ తరగతి పరీక్షల్లో రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంక్ సాధిస్తే వారికి తమ ఫౌండేషన్ ద్వారా రూ. 5 లక్షలు నగదు బహుమతిని అందిస్తామని విద్యార్థినుల హర్షధ్వానాల మధ్య . పచ్చిపాల రామనాథమ్మ అకాడమి ఫౌండేషన్ చైర్మన్ రాధాకృష్ణారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పాఠశాలకు చెందిన విద్యార్థులు 590 మార్కులు సాధిస్తే పచ్చిపాల రామనాథమ్మ ఎడ్యుకేషనల్ అకాడమి ద్వారా2 లక్ష రూపాయలు నగదు బహుమతి అందజేయడం జరుగుతుందని విద్యార్థినుల హర్షధ్వానాల మధ్య పచ్చిపాల రామనాథమ్మ ఎడ్యుకేషనల్ అకాడమ్డి ప్రకటించారు. అదేవిధంగా 590 మార్కులు ఎంతమంది సాధించినా వారందనికీ ఒక్కొరికి2 లక్ష రపాయలు బహుమతి అందజేస్తామన్నారు. ప్రతి విద్యార్థి పోటీతత్వాన్ని అలవరుచుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సోఫియా కిరణ్మయి, వైస్ ఎంపీపీ శివుని నరసింహులురెడ్డి, వైకేఆర్అండ్‌కే డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీప్రసూన, సైన్స్ ఉపాధ్యాయులు కె. భారతి, వి. సుచరిత, ఈ. రాజేశ్వరి, ఎన్. సుజన, కె. సుబ్బమ్మ, ఎన్. శైలజ, కె. శివజ్యోతి, పి. చంద్రమౌళి, తదితరులు ఉన్నారు.

## పదవీ విరమణ చేసిన కె.విజయానంద్‌కు మూడు కీలక బాధ్యతలు



**విజయవాడ, ఫిబ్రవరి 28, ప్రభాత వార్త ప్రతినిధి:** పదవి విరమణ చేసిన వెంటనే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌కు మూడు కీలక బాధ్యతలు లభించాయి.విజయానంద్ సేవలు భవిష్యత్ లోనూ కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శిగా సాయి ప్రసాద్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు సీఎస్ గా బాధ్యతలు నిర్వహించిన విజయానంద్ శనివారమే ఎక్స్ అఫిషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బాధ్యతలు లభించాయి. ఈ మేరకు అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసారు. ఏకంగా మూడు బాధ్యతలను విజయానంద్ కు అప్పగిస్తూ ఉత్తర్వుల్లో స్పష్టత ఇచ్చారు. సీఎంఓ తో సహా విద్యుత్ శాఖ బాధ్యత లను అప్పగించారు.ఇప్పటి వరకు ఆయన చూసిన విద్యుత్ శాఖనే అప్పగిస్తూ ఏకంగా ముఖ్యమంత్రి ఎక్స్ అఫిషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ గా నియమించుకున్నారు. దీంతో విజయానంద్ ఏడాది పాటు ఇంధన శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ గా, ఏపీట్రాన్స్కో సీఎండీ గా కూడా బాధ్యతలు నిర్వహించనున్నారు. ఏడాది పాటు అయన ఈ పదవిలో కొనసాగుతారు అని ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

విద్యుత్ శాఖ విషయంలో ఇక ఆయన ఎవరికీ రిపోర్ట్ చేయాల్సిన అవసరం ఉండకుండా ముఖ్య మంత్రి ఎక్స్ అఫిషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ గా నియమించారు.సీఎంఓ లో ముఖ్య కార్యదర్శిగా ఉన్న ముద్దాడ రవిచంద్రను పూర్తి స్థాయిలో టీటీడీ ఈఓ గా నియమించారు.

## బడ్జెట్‌లో నిఘా భద్రతకు అదనపు కేటాయింపులు

**- ధర్మప్రచారానికి భారీగా నిధులు - 2026-27 టిటిడి బడ్జెట్ ఆమోదించిన బోర్డు**



**తిరుమల,ఫిబ్రవరి 28ప్రభాతవార్తప్రతినిధి:** ప్రసిద్ధ హిందూ ధార్మిక సంస్థ తిరుమల తిరుపతిదేవస్థానం వార్షిక బడ్జెట్‌లో ముందెన్నడూ లేనివిధంగా నిఘాభద్రత విభాగానికి అదనపు నిధులు కేటాయించింది. ధర్మప్రచారానికి ఈ బడ్జెట్‌లో అధికప్రాధాన్యత నిచ్చినట్లయింది. 2026-27 వార్షిక బడ్జెట్‌ను 5,456.26కోట్ల రూపాయల అంచనాతో రూపొందించి టిటిడి బోర్డు ఆమోదించింది. శనివారం తిరుమల అన్నమయ్యభవనంలో జరిగిన టిటిడి బోర్డు సమావేశంలో ఛైర్మన్ బిఆర్‌నాయుడు అధ్యక్షతన టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, బోర్డు సభ్యులు సుదీర్ఘంగా చర్చించి పలు రకాలుగా ఆదాయవ్యయాలను బేరీజు వేసుకుంటూ 2026-27బడ్జెట్‌ను ప్రవేశపెట్టి ఆమోదం తెలిపారు. గత ఏడాది వార్షిక బడ్జెట్ ప్రతిపాదనలకంటే ఈ ఏడాది బడ్జెట్‌ను 170,58కోట్లు అత్యధికంగా ఆదాయం సమకూర్చుకునే దిశగా రూపొందించారు. 2025-26 వార్షిక బడ్జెట్‌ను 5,258.68కోట్ల రూపాయలతో ఆమోదించగా 5,394.52కోట్లు చేకూరింది. 135.84కోట్లు రూపాయలు అదనంగా ఆదాయం సముపార్జించుకున్నారు. దీన్ని పరిగణనలోనికి తీసుకుని ఈ ఏడాది వార్షిక బడ్జెట్‌ను 170.58కోట్ల రూపాయలు అదనంగా టిటిడికి ఆదాయం సమకూర్చుకునేలా ప్రతిపాదనలు తయారుచేశారు.

## గ్రూప్1 మూల్యాంకనంలో అక్రమాలపై సిట్ విచారణ పర్యవేక్షిస్తాం : హైకోర్టు

**విజయవాడ.ఫిబ్రవరి28,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీపీఎస్సీ గ్రూప్1 ప్రధాన పరీక్ష మూల్యాంకనంలో అక్రమాల గుట్టురట్టు చేసేందుకు తమ ఆదేశాలతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ పారదర్శక, చిత్తశుద్ధితో విచారణ చేస్తుందని తాము భావిస్తామని హైకోర్టు పేర్కొంది. సిట్ విచారణ పూర్తి చేసి కోర్టుకు నివేదిక ఇచ్చేంత వరకు ఈ వ్యవహారాన్ని తాము పర్యవేక్షి స్తామని ఈ సందర్భంగా హైకోర్టు స్పష్టం చేసింది.గ్రూప్1 మూల్యాంకనంలో అక్రమాల వ్యవహారంపై దాఖలైన అప్పీళ్ల విచారణకు న్యాయస్థానం ఇప్పటికే గణనీయమైన సమయం కేటాయించిన నేపథ్యంలో అప్పీళ్ల విచారణ కొలిక్కి వచ్చేంత వరకు తామే విచారణ కొనసాగిస్తామని(పార్ట్ హెర్డ్) హైకోర్టు స్పష్టం చేసింది. సిట్ నివేదిక దాఖలు చేసే నిమిత్తం విచారణను మార్చి 16కు వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ హరిహరనాథ శర్మతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది. హైకోర్టును సమయం కోరిన సీఎస్: గ్రూప్1 పరీక్ష ద్వారా ఉద్యోగాలు పొందిన వారిని అప్రాధాన్యత పోస్టులకు బదిలీ చేసి, సంబంధిత వివరాలను కోర్టు ముందు ఉంచేందుకు ఈనెల 25న జరిగిన విచారణలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) కె.విజయానంద్ హైకోర్టును సమయం కోరారు. ఈ నేపథ్యంలో ఈ వ్యవహారంపై విచారణ జరిగింది. సీఎస్ తరఫున ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) ఎస్ ప్రణతి స్పందిస్తూ కోర్టు ఆదేశాలను అమలు చేసి వివరాలనుమెమో రూపంలో కోర్టు ముందు ఉంచామని తెలిపారు. ఆదేశాల మేరకు దర్యాప్తు ఉంటుందన్నారు.

## కాకినాడలో జరిగిన బాణసంచా పేలుడు ఘటనపై మంత్రులు తీవ్ర విచారం

**విజయవాడ,ఫిబ్రవరి 28,ప్రభాతవార్తప్రతినిధి:** కాకినాడలో జరిగిన బాణసంచా పేలుడు ఘటనపై మంత్రులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో చనిపోయిన వారికి నివాళులర్పించారు. బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రులు భరోసా ఇచ్చారు. కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెంలో బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడు ఘటనపై మంత్రి లోకేశ్ సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.పలువురు మృత్యువాతపడటం మాటలకందని విషాదమన్నారు. మృతులకు నివాళులర్పించారు మంత్రి. మృతుల కుటుంబాలను కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందని.. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందిస్తామని మంత్రి లోకేశ్ తెలిపారు.వేట్లపాలెంలో జరిగిన ఘోర అగ్నిప్రమాదంపై ఇన్‌ఛార్జ్ మంత్రి నారాయణ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి ఘటనకు గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. బాధితులకు అత్యవసర చికిత్స అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఘటనా స్థలానికి వైద్యులను పంపించి తక్షణ వైద్య సాయం అందించాలని ఆదేశించారు. బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి నారాయణ తెలిపారు. సామర్లకోట మండలం వేట్లపాలెంలో పేలుడు ఘటనపై హోం మంత్రి అనిత స్పందించారు. కార్మికుల మృతిపట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. విజయనగరం జిల్లా చీపురుపల్లి నుంచి హుటాహుటిన వేట్లపాలెంలో పేలుడు ఘటన స్థలానికి హోంమంత్రి బయలుదేరారు. కాకినాడ జిల్లా కలెక్టర్, ఎస్పీతో ఎప్పటికప్పుడు హోం మంత్రి అనిత ఫోన్లో మాట్లాడి వివరాలు ఆరా తీశారు. వేట్లపాలెంలో బాణసంచా పేలుడు ఘటనపై మంత్రి సత్య కుమార్ యాదవ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తక్షణ వైద్య సహాయక చర్యలు చేపట్టాలని వైద్యశాఖ సెక్రటరీ, డీఎంఈ, డీఎంహెచ్ఓలకు ఆదేశాలు జారీ చేశారు. సూపర్ స్పెషాలిటీ వైద్యులు, ఇతర సిబ్బందిని సంఘటనా స్థలానికి వెంటనే పంపాలని.. అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

## వాట్సాప్,యుపిఐ వంటి యాప్‌ల వినియోగానికి సంబంధించి మార్చి 1నుంచి కొన్ని మార్పులు

**విజయవాడ,ఫిబ్రవరి 28,ప్రభాతవార్తప్రతినిధి:** వాట్సాప్,యుపిఐ వంటి యాప్‌ల వినియోగానికి సంబంధించి మార్చి 1వ తేదీ నుంచి కొన్ని మార్పులు రాబోతున్నాయి. సిమ్ బైండింగ్, యూపీఐ సంబంధిత నియమాలు ఇందులో ప్రధానమైనవి. ఇకపై.. వాట్సాప్, టెలిగ్రామ్, అరట్టై వంటి మెసేజింగ్ యాప్‌లు సక్రమంగా పనిచేయాలంటే సిమ్ కార్డు బైండింగ్ నిబంధనను తప్పనిసరి చేసింది కేంద్రం. దీని ప్రకారం వినియోగదారులు తమ ఫోన్‌లో రిజిస్టర్ చేసుకున్న యాక్టివ్ సిమ్ కార్డ్ తప్పనిసరిగా ఉండాలి. సిమ్ లేకపోతే లేదా తొలగిస్తే ఆ సేవలు పనిచేయవు. అదనంగా వాట్సాప్ వెబ్ వంటి డెస్క్‌టాప్ సెషన్లు ప్రతి 6 గంటలకు ఒకసారి ఆటోమేటిక్‌గా లాగౌట్ అవుతాయి. వాటిని తిరిగి యాక్సెస్ చేయడానికి మళ్లీ ధ్రువీకరించుకోవాలి. అయితే.. సైబర్ మోసాలను అరికట్టడమే లక్ష్యంగా ఈ తరహా నిబంధలను తీసుకొచ్చింది కేంద్రం. రైల్వే శాఖలో గతంలో తీసుకొచ్చిన అన్‌రిజర్వ్‌డ్ టికెటింగ్ సిస్టమ్(యూటీఎస్) ఇకపై పనిచేయదు. జనరల్ టికెట్లు, ప్లాట్‌ఫామ్ టికెట్ల బుకింగ్ కోసం ప్రవేశపెట్టిన ఈ సేవలు మార్చి 1 నుంచి నిలిపివేస్తున్నట్టు రైల్వే స్పష్టం చేసింది.

## రాష్ట్రంలో పెరగనున్న పగటి ఉష్ణోగ్రతలు

**విజయవాడ,ఫిబ్రవరి28,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో మార్చి నుంచి మే వరకు మూడు నెలల పాటు రోజువారి పగటి ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదయ్యే అవకాశాలున్నాయి.ఐఎండి సూచనల ప్రకారం ఈ 2026 వేసవిలో మార్చి నుంచి మే వరకు సెంట్రల్ ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో లో సాధారణం కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ వెల్లడించారు. అలాగే కనిష్ఠ ఉష్ణోగ్రతలు రాయలసీమ, ఉత్తరాంధ్ర కొన్ని జిల్లాల్లో సాధారణం కంటే ఎక్కువ నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. మార్చి నెలలో సెంట్రల్ ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో లో సాధారణం కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. సాధారణం కంటే ఎక్కువ రోజుల పాటు వడగాల్పులు ఉంటాయన్నారు.

